# చెల్లిననోటు



మొవ్వ బాబూరావు

ఇంకేమీ వద్దు - బిల్లు ఇవ్వమని సౌంజ్ఞ చేసాడు అప్పారావు మంచినీళ్ళు తాగుతూ.

ప్లేట్ మైసూరు బోండా పది రూపాయలా? సర్వారావు తెచ్చిన బిల్లును చూసి ముక్కున వేలేసుకున్నాడు.

కొత్తగా ప్రారంభోత్సవం చేసిన హైక్లాస్ హోటలది. రద్దీ విపరీతంగా ఉంది. ఈ జనాలకి ఇదేం పిచ్చో ఇళ్ళల్లో ఏమీ తినిచావరేమో, ఏ కొత్త హోటల్ ఓపెన్ చేసినా కిటకిటలాడిపోవటమే కదా! హోటళ్ళల్లో ఉన్న గొప్పతనం - ఇళ్ళల్లో లేకపోవటానికి కారణం ఏమిటా అని ఆలోచించసాగాడు అప్పారావు. ఇంట్లో తినేదీ తింటుంటే హోటల్లో ఏది తిన్నా అమృతంలా ఉంటుందేమో? లేకపోతే వెధవ బోండాలు - గోళీకాయలంత లేవు. వీటికి ఇంత రుచి ఎక్కడ్నించి వచ్చి ఉంటుందబ్బా?? పొరబాటుగా ఇదే విషయం అలివేలు దగ్గిర ప్రస్తావిస్తే ఇంకేమైనా ఉందా? అంతేలెండి మీకు బయట ఏం తిన్నా మహా రుచిగానే ఉంటాయి. మేం కొంపల్లో చెమటోడ్చి చేస్తాం - ఆ హోటల్ వాళ్ళు చెమట ఝూడించి చేస్తారు. అందుకనే మహాశయా అవి అంత రుచిగా ఏడుస్తాయి" అని దులిపి పారేస్తుంది.


ఏమో? అది కూడా కొంపదీసి నిజమేనేమో ఎందుకో ఒక్కసారి అనుమానమొచ్చేసింది అప్పారావుకి.

ఏమైనా సరే! ఒకసారి అలివేల్ని ఇలాంటి హోటళ్ళకి తీసుకొచ్చి ఈ టిఫిన్ల రుచి చూపించాల్సిందే. అప్పటికప్పటికే ఒక గట్టి నిర్ణయం తీసుకున్నాడు అప్పారావు.

మరో రెండు గ్లాసుల నీళ్ళు త్రాగి సర్వారావు ఇచ్చిన బిల్లుని చేతిలోకి తీసుకొని జేబులో చేయి పెట్టుకుంటూ క్యాష్ కౌంటర్ వైపు నడిచాడు.

"ఏమిటో ఇంట్లో ఎంత తిన్నా తిన్నట్లే ఉండదు. హోటల్లో ఒక టిఫిన్ తినేసరికే కడుపు నిండిపోతుంది. ఎందుకబ్బా ఇలా అవుతుంది?" మనస్సులోనే ప్రశ్నించుకున్నాడు.

"బిల్లును చూసేసరికి అలానే అవుతుంది. అంతగా ఆశ్చర్యపడమాకు" అన్నాడు ఆత్మారాముడు.



**బిజీ**

మాజీ మిస్‌వరల్డ్ యుక్తాముఖిని బాలీవుడ్ ఇండస్ట్రీలో పట్టించుకునే వారే లేకపొయ్యారు. కానీ మనీషా కొయిరాలా నిర్మిస్తున్న 'మార్కెట్' చిత్రంతో యుక్తా వెండితెరపై వచ్చే ప్రయత్నం చేస్తోంది. యుక్తాకు ఇది రెండవ సినిమా. తొలి చిత్రం 'ప్యాసా' షూటింగ్ సగంలో ఆగిపోయింది. దీనితో ఐరన్‌లెగ్‌గా ముద్రపడిన ఆమె మళ్ళీ మార్కెట్‌తో ప్రేక్షకులను కనువిందు చెయ్యబోతోంది. ఈ చిత్రంపై ఎన్నో ఆశలు పెట్టుకుని, బాలీవుడ్‌లో టాప్ హీరోయిన్ అవ్వాలని యుక్తా కలలు కంటోంది.

"నువ్వారుకోరా! ప్రతిదానికి నువ్వొకడివి. ఆవిడగారే అనుకుంటే నాకు నువ్వే మొగుడివి దొరికావు" ఠక్కున ఫ్లాష్‌లో అలివేలు ప్రత్యక్షమయిపోయింది.

భార్య ఇంత ఫ్రీక్వెంట్‌గా ఏ సందర్భంలో పడితే ఆ సందర్భంలో ఇలా గుర్తుకొచ్చేసరికి తెగ ఫీలయిపోతున్నాడు అప్పారావు.

కౌంటర్ దగ్గిరకొచ్చేసరికి ఓ ఐదురూపాయల నోటుని - మరో ఇరవై నోటుని బయటకు తీసిచ్చింది. ఇందాకట్నించీ జేబులోనే సర్కస్ చేస్తున్న చేయి.

ఆకుపచ్చ చీరకట్టుకొని అప్పుడే ప్రింటింగ్ ప్రెస్‌లోనుంచి వచ్చిన పెళ్ళికూతుర్లా ఉంది ఐదు రూపాయల నోటు. దుమ్ములో కొట్టుకుపోయి, వెలిసిన ఇటికలా, ఎండబెట్టిన కొబ్బరి పీచులా, ఏబ్రాసి మొహంతో వెలవెలపోతోంది ఇరవైనోటు. పైగా దీనికి తోడు నోటు మధ్యలో ఓ పెద్ద కంత. ఇంక్రిమెంట్లు లేకుండా సర్వీస్ చేస్తున్న ఎన్.జీ.ఓ. మొహంలా ఉంది దాని వాలకం. దాన్ని చూడంగానే తిన్న నాలుగు మైసూర్ బజ్జీలు మళ్ళీ బయటకి వచ్చేస్తాయేమో అన్నంత ఫీలింగ్ కలిగింది అప్పారావుకి.

ఆ నోటుని మారుద్దామని వారం రోజుల్నించి విశ్వప్రయత్నం చేస్తున్నాడు అప్పారావు.

ఎన్నో క్రొత్త నోట్లు వస్తున్నాయి, చేతులు మారుతున్నాయి కానీ ఈ దరిద్రం మాత్రం తన లైఫ్ పార్ట్‌నర్లా వదిలించుకొందామనుకున్నా వదిలి చావటం లేదు. ఏమిటో దీనికి, తనకు ఈ అవినాభావ సంబంధం. అసలే మొహమాటస్తుడు - చూస్తూ చూస్తూ ధైర్యంగా ఎవరి చేతిలో పెట్టలేకపోతున్నాడు.

అక్కడికీ ధైర్యం చేసి ఓరోజు చంటాడికి చాక్లెట్లు కొనిద్దామని ఫాన్సీ షాప్‌లో ఓ రెండు రూపాయలకని చాక్లెట్లు తీసుకుని ఈ ఇరవై నోటుని షాప్ వాడికి అందించాడు కాస్త బెరుగ్గానే. కిండర్ గార్డెన్ చదువుతున్న పిల్లాడిలా నఖశిఖ పర్యంతం ఆ ఇరవై నోటుని దుర్భిణీతో పరీక్షించినట్లు పరీక్షించి 'దూసరాదేవ్' అంటూ మొహాన కొట్టాడు షాప్‌వాడు. తీసుకున్న చాక్లెట్లు వద్దంటే ఏం తిట్టిపోస్తాడో అని మొహమాటపడిపోయి నిక్షేపంగా ఉన్న రెండు రూపాయల నోటుని షాప్ వాడికి ఇచ్చి బయటపడ్డాడు.


ఆ మర్నాడు బస్సు కండక్టర్ దగ్గిర, ఆ తరువాత పాలవాడి దగ్గర, మురిక్కాలవ దగ్గర బండి పెట్టుకొని మిర్చి బజ్జీలువేసేవాడి దగ్గిర... ఇలా ఒకళ్ళేమిటి కనపడిన ప్రతివాడి దగ్గిరా ఇరవైనోటుని వదిలించుకుందామని విశ్వప్రయత్నం చేశాడు.

నోటిని చేతిలోకి తీసుకున్న ప్రతివాడు ఆ నోటుకన్నా అసహ్యంగా మొహంపెట్టి అప్పారావుని అన్ని భాషల్లోను శాపనార్థాలు పెట్టారు.

ఏమైనా ఈ నాలుగు రోజుల్లో అప్పారావు ఒక విధమైన ఎక్స్‌పీరియన్స్ వచ్చింది. మునుపటిలా ఇప్పుడు అతను మొహమాట పడటం లేదు. విసుగు చెందని విక్రమార్కుడే తనకి స్ఫూర్తి. ఆ నోటుని అతి త్వరలో వదిలించుకోవటమే ఇప్పటి తన జీవిత లక్ష్యం అని నిర్ధారించేసుకున్నాడు.

ఏ చిన్న వస్తువు కొన్నా ఆ నోటుని తీస్తున్నాడు. విధి మాటి మాటికి వక్రిస్తున్నందువల్ల మళ్ళీ మళ్ళీ జేబులోనే భద్రపరుస్తున్నాడు. అప్పారావు చేతి విన్యాసాలకు నోటు మీదున్న కంత క్యాన్సర్‌లా నోటంతటిని ఆక్రమించేటట్లుంది. రోజులు గడుస్తున్నకొద్దీ అప్పారావులో సహనం నశిస్తోంది.

అప్పారావుకి చిర్రెత్తుకొచ్చేసింది. ఒక్కసారి ఆ నోటుని కసితీరా చింపేద్దామనుకున్నాడు ఆవేశంగా. కానీ అతనికి ప్రెస్టేజి ఇస్యూ వచ్చేసింది. ఎంతెంతో నల్లధనాన్ని అతి తేలిగ్గా తెల్ల చేసి పారేస్తున్నారు. ఆఫ్టరాల్ ఈ వెధవ ఈ ఒక్క నోటుని తను మార్చలేకపోవటమా - నో -



తను అంత చవట కాదు.

"అలా అనుకోవటానికి వీలు లేదోయ్ అప్పారావు! నువ్వు చవటవి కాబట్టే నీకెవడో దీన్ని అంటగట్టాడు. దీన్ని మార్చేదాకా నువ్వు చవటన్నర చవటవే" పగలబడి నవ్వుతున్నాడు అంతరాత్మగాడు.

ఛీ! ఛీ! వీడొకడు. నేనెంత సర్దుకుపోదామనుకున్నా సర్దుకుపోనీయక నన్ను మరీ దద్దమ్మగా జమగడుతున్నాడు. అప్పారావుకి జయంబు నిశ్చయంబురా పాట జ్ఞాపకం వచ్చేసింది. అంతే! రెండు రోజుల్లో ఈ నోటుని మార్చేస్తాను బెట్ అంటూ అంతరాత్మతో ప్రతిజ్ఞ చేశాడు ఆవేశంగా.

నేను గెలుస్తానని అప్పారావు అంటే నువ్వు ఓడితీరుతావని అంతరాత్మ వాదించుకున్నారు. అప్పట్నించి వాళ్ళిద్దరిమధ్య కార్గిల్ యుద్ధం మొదలైంది. క్యాష్ కౌంటర్ దగ్గిర పడుతున్న కొద్దీ అప్పారావు అడుగులు నెమ్మదిగా పడుతున్నాయి. టేబుల్స్ దగ్గిరే కాదు, కౌంటర్ దగ్గిర కూడా జనం విపరీతంగా ఉన్నారు. క్యాషియర్ పవర్‌ఫుల్ మెగ్నీషియం బల్బులా మెరిసిపోతున్నాడు. బిల్లు తీసుకోవటం, డబ్బు లెఖ్ఖ పెట్టుకోవటం సెకండ్ల మీద చిల్లర ఇవ్వటం.... అతని పద్ధతి చూస్తుంటే ఎవరో మెజీషియన్ డబ్బులతో మ్యాజిక్ చేస్తున్నట్లనిపించింది.

అక్కడి వాతావరణం - ఆ జన సందోహం చూసి, సమయం, సందర్భం భలేగా కలిసొచ్చాయి ఓ ట్రయిల్ వేస్తే పోతుందనుకున్నాడు.

అప్పారావు తన తెలివి తేటలకు తనే మెచ్చుకుంటూ-

కాస్త బెరుగ్గనే, తెచ్చి పెట్టుకున్న గాంభీర్యంతో వడివడిగా కౌంటర్ దగ్గిరకు వెళ్ళి చేతిలో ఉన్న బిల్లును క్యాషియర్ ముందుంచి దానిమీద విలాసంగా ఇరవై నోటుంచి, టైం వేస్టయిపోతోందన్నట్లు మాటి మాటికి రిస్ట్ వాచీ వంక విసుగ్గా చూడటం మొదలెట్టాడు.

అంత హడావుడిలోనూ, క్యాషియర్ తనిచ్చిన ఇరవైనోటుని నోటీస్ చేసినట్లనిపించింది అప్పారావుకి.

అంతరాత్మగాడు అమెరికా ప్రెసిడెంట్‌లా నవ్వాడు.

పీకలదాకా కోపం వచ్చినా తమాయించుకున్నాడు అప్పారావు అటల్ బిహారీ వాజ్‌పాయిలా.

అంతలో.... ఆశ్చర్యం... పెళ్ళారి గుంపులో చేరిపోయిన బిచ్చగాడిలా క్యాషియర్ బాక్స్‌లో దూరిపోయింది అప్పారావిచ్చిన ఇరవై నోటు.

అప్పారావు గుండె అదురుతోంది. దగ్గిర్లో ఉన్న ఏ కార్డియాలజిస్ట్‌ని కలిస్తే బావుంటుందో అని మననం చేసుకుంటున్నాడు...

మరో ఇద్దరు వచ్చి క్యాష్ పే చేసి క్యాషియర్ ఇచ్చిన చిల్లర డబ్బులు తీసుకొని వెళ్ళిపోయారు.

అవునూ తన దగ్గిర డబ్బు తీసుకున్నాడేగాని చిల్లర ఇవ్వడేమిటి? లబ్ డబ్ లబ్ డబ్ అంటూ వేగంగా కొట్టుకొంటున్న గుండెను కంగారు పడొద్దని ధైర్యం చెప్పే స్థితిలో లేడు. మినీ తిరుపతి మనీ కలక్షన్లా ఉంది క్యాష్ బాక్స్. ఆ పెట్టెనిండా రకరకాల రంగులనోట్లు ఓ సైడ్‌లోనుంచి చూస్తుంటే కనిపిస్తున్నాయి. ఆశ్చర్యం తనిచ్చిన స్పెసిమిన్ నోటు ఎక్కడుందో కనబడటం లేదు వాటిల్లో.

కౌంటర్ దగ్గిరేనుంచుని, క్యాషియర్ వంక అదో విధమైన దీనపు చూపులతో గుడ్లప్పగిస్తూ అలానే వంకరగా నుంచున్నాడు అప్పారావు.

ఓ సారీ మీకు ఛేంజ్ ఇవ్వలేదు కదా అంటూ ఠక్కున డబ్బు తీసి అప్పారావు చేతిలో మర్యాదగా పెట్టాడు క్యాషియర్.

మారు మాట్లాడకుండా చేతిలో పడ్డ డబ్బుని జేబులో పడేసుకుని మరీ తొందరగా నడిచి వెళ్ళిపోతే ఇరవైనోటుని చూపిస్తూ వెనక్కి పిలుస్తాడేమో అన్న భయంతో నెమ్మదిగా చాలా కాజువల్‌గా లలలా లలలా లక్కీ ఛాన్సులే అనుకుంటూ నెమ్మది నెమ్మదిగా అడుగులు వేసుకుంటూ హోటల్నుంచి బయటపడ్డాడు అప్పారావు. అలివేలు చంటాడితో సహా పుట్టింటికి వెళ్ళినప్పుడు కూడా ఇంతటి ఆనందం తను పొందలేదు.

ఇన్నాళ్టికి తనని అంటిపెట్టుకున్న దరిద్రాన్ని వదిలించుకున్నాడు. తను గెలిచాడు - చవట కాదని నిరూపించుకున్నాడు.

మైసూర్ బోండాలు తిన్న మత్తులో ఇన్నర్ సోల్‌గాడు నిద్రపోతున్నట్లున్నాడు. పాపం పలకటం లేదు.

అప్పారావులో ఏదో విజయగర్వం - గాలిలో తేలిపోతున్నట్లు ఫీలయిపోతున్నాడు. కరోడ్‌పతీ ఐపోయినట్లు తెగ సంబరపడిపోతున్నాడు.

మీఠాయికిళ్ళీ వేసుకుని, తన కిష్టమైన బ్రాండ్ సిగరెట్టు లాగిస్తేనేగాని పూర్తి శాంతి ఈ జీవికి జరగదని నిర్ణయించుకుని ఎదురుగుండా కనబడుతున్న కిళ్ళీషాపు వైపు దారి తీశాడు హుషారుగా ఈల వేసుకుంటూ.

అదేదో దండకం చదివి కిళ్ళీ కట్టమని ఆర్డరిచ్చి జేబులోనుంచి డబ్బు తీశాడు.

ఆశ్చర్యం...

రెండు ఐదునోట్లు- అనే అనుకోవాలి.

గల్ఫ్ యుద్ధంలో సముద్రంలో కలిసిపోయిన నూనె అంతటినీ వీటితోనే అద్దారా అన్నట్లున్నాయి వాటి వాలకాలు. అసలు ఈ కరెన్సీ మన దేశానిదేనా అన్న అనుమానం వచ్చింది అప్పారావుకి ఆ నోట్లని చూస్తుంటే. అంతరాత్మగాడు మేలుకుని విజృంభిస్తున్నాడు.

ఎదురుగుండా కనబడుతున్న హోటల్‌వైపే చూస్తూ ఫ్రేం కట్టిన ఫోటోలా అలానే నిల్చుండిపోయాడు అప్పారావు. ❋

